సాక్షి మహబూబాబాద్

సోమవారం | 20 | నవంబర్ | 2023



నగదుపై నజర్..
- రూ.లక్ష పరిమితి దాటితే లెక్క చెప్పాలి
- ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా..!

- 10లో▸



న్యాయ వ్యవస్థపై పెరుగుతున్న నమ్మకం

ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరుగుతోందని హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. - 10లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలితో పాటు మంచు పడుతుంది.

న్యూస్‌రీల్

నేడు ఘన్‌పూర్‌కు సీఎం కేసీఆర్ రాక



స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి వస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ మండలం ఛాగల్లు శివారు శివారెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం హెలికాప్టర్‌లో ఇక్కడికి చేరుకుంటారని, సభాస్థలి, హెలిపాడ్ వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. సభకు లక్ష మందికి పైగా ప్రజలు హాజరవుతున్నట్లు వివరించారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

- అదనపు కలెక్టర్ డేవిడ్



మహబూబాబాద్: ధాన్యం కొనుగోళ్లలో కచ్చితమైన ప్రమాణాలు పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వొద్దని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా, జీసీసీ నిర్వాహకుల శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు జరిగిన వెంటనే రైతులకు డబ్బులు అందేలా ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. టార్పాలిన్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు ఎండిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. సమావేశంలో డీసీఓ ఖుర్షీద్, డీసీఎస్ఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

23,24తేదీల్లో హోం ఓటింగ్



మహబూబాబాద్: ఈ నెల 23,24తేదీల్లో హోం ఓటింగ్‌ను చేపట్టనున్నట్లు మానుకోట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అలివేలు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం (రిటర్నింగ్ అధికారి కార్యాలయం)లో హోం ఓటింగ్ కార్యక్రమంపై వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అలివేలు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 12మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, 30రూట్లలో గుర్తించిన 471మంది హోం ఓటర్ల నివేదికను సంబంధిత పార్టీల ప్రతినిధులకు అందజేశామని చెప్పారు. హోం ఓటింగ్‌కు సంబంధిత ఓటర్లు అందుబాటులో ఉండాలన్నారు. ఇంటి వద్దే ఓటు వేయిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



నెల్లికుదురు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం 67వ ఎస్‌జీఎఫ్ సెపక్‌తక్రా, తాంగ్‌తా క్రీడలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి 67వ సెపక్‌తక్రా, తాంగ్‌తా క్రీడల్లో 14, 17, 19సంవత్సరాల విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు క్రీడల్లో వివిధ జిల్లాల నుంచి 700 మంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో విజేతలకు బహుమతులతో పాటు ప్రతి క్రీడాకారుడికి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడల నిర్వహణ కన్వీనర్‌గా సీహెచ్ అయిలయ్య, రాష్ట్ర పరిశీలకులుగా హరికృష్ణ రమణ, కృష్ణమూర్తి, శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌చందర్, పీఈటీ నాగయ్య, రవి, సునీల్, ప్రభాకర్, మల్లయ్య, కిషన్‌నాయక్, మధు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల జోరు.. ప్రచార హోరు

గొంతు చించుకుంటున్న ప్రచార రథాల మైకులు!
- వాడవాడలా వాహనాలతో విస్తృత ప్రచారం
- ఆకర్షిస్తున్న డిజిటల్ స్క్రీన్‌లు
- ఆకట్టుకుంటున్న కళాకారుల ఆటపాటలు

ఎలాగైనా జెండా ఎగురవేయాలన్నదే అన్ని పార్టీల ఎజెండా. ఇందుకోసం అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వివిధ రూపాల్లో ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రజల్లోకి తమ పంథాను తీసుకెళ్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా పార్టీల ప్రచార సరళిపై 'సాక్షి' ప్రత్యేక కథనం. – హన్మకొండ అర్బన్

నియోజకవర్గాల వారీగా ప్రచారం కోసం అనుమతి పొందిన వాహనాలు

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు	మొత్తం
జనగామ	54	39	22	6	121
స్టేషన్‌ఘన్‌పూర్	52	46	30	221	349
పాలకుర్తి	25	16	19	4	64
డోర్నకల్	14	17	2	6	39
మహబూబాబాద్	22	14	17	4	57
నర్సంపేట	26	27	08	10	71
పరకాల	16	15	30	13	74
వరంగల్ పశ్చిమ	8	14	23	15	60
వరంగల్(తూ)	17	28	23	7	75
వర్ధన్నపేట	16	23	23	4	66
భూపాలపల్లి	28	18	11	11	68
ములుగు	15	17	15	05	52
మొత్తం	296	274	202	306	1078



నామినేషన్ల పర్వం ముగిసింది. పోలింగ్ తేదీ ఇంకా పది రోజులే ఉంది. ఏ లెక్కన చూసినా అభ్యర్థులు ఓటర్లను ముఖాముఖి కలిసే పరిస్థితి లేదు. దీంతో వాహనాల్లో మైక్‌సెట్లు, డీజేలు, కళాకారుల పాటల ద్వారా ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు కలిపి వెయ్యికిపైగా ప్రచార వాహనాల కోసం అనుమతులు తీసుకున్నాయి. వాటిలో అధికార పార్టీ వాహనాల సంఖ్యే కాస్త ఎక్కువ. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రచారం, ర్యాలీలు, హెలికాప్టర్ వంటి వాటిని పార్టీ పనుల కోసం సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలని నిబంధనలు ఉండడంతో అందరూ అలాగే చేస్తున్నారు. ఇంకొందరి దరఖాస్తులు ఆర్‌ఓల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

హోరెత్తిస్తున్న ప్రచార రథాలు

ఎన్నికల వేళ.. ప్రచారం పలు విధాలుగా జరుగుతోంది. కానీ.. అన్ని ప్రధాన పార్టీల్లోనూ కామన్ థింగ్ 'ప్రచార రథం'.. తెల్లారింది మొదలు రాత్రి వరకు ఆయా పార్టీల ప్రచార వాహనాలు గల్లీలన్నింటినీ చుట్టేస్తున్నాయి. ఒక్కో వీధిలో రోజుకు ఏడెనిమిదిసార్లు చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థుల పేర్లతో, ఆకట్టుకునే పాటలతో ప్రచారం సాగిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ తాము చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని వివరిస్తూ వాహనాల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. బీజేపీ.. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నిధులు, స్థానికంగా చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. ఆయా అభ్యర్థుల గుణగణాలతో ప్రచారంలో దూసుకెళ్తోంది. కాంగ్రెస్ ప్రధానంగా ఆరు గ్యారెంటీలను తెలుపుతూ.. అండగా నిలవాలని ప్రచారం కొనసాగిస్తోంది.

కళ్లకు కట్టినట్లుగా..

దృశ్య రూపంలో చూసింది ఎక్కువగా గుర్తుంటుందనే సిద్ధాంతాన్ని నాయకులు గట్టిగా పట్టుకున్నారు. వీడియోలను ప్లే చేస్తూ ప్రజల మెదళ్లలోకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన పథకాలు, అమలు చేయబోయే హామీలను, అభ్యర్థుల గొప్పదనాన్ని తెలిపేలా వాహనాలకు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండే ఏరియాల్లో కూడళ్లలో నిలిపి స్క్రీన్లపై వీడియోలు చూపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్క్రీన్ల ద్వారా ప్రజల్ని ఎక్కువగా ప్రభావితం చేయడంలో నాయకులు సఫలీకృతులవుతున్నారు.

గజ్జె కట్టి.. చిందులేసి

ఆయా పార్టీలు ఓటు అభ్యర్థించడం కోసం కూడళ్లలో కళాకారులతో పాటలు పాడిస్తున్నాయి. కళాకారులు కాలికి గజ్జె కట్టి, గోచి, గొంగడి వేసి కదం తొక్కుతూ పాటలు పాడుతున్నారు. పార్టీ ప్రాధాన్యాన్ని ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్తున్నారు. ఇరువైపులా ఆయా పార్టీలు పెద్ద పెద్ద ఫ్లెక్సీలు అమర్చి ఒక వైపున స్టేజీ మాదిరిగా డీసీఎం వాహనాన్ని తయారు చేసి కళాకారులు పార్టీ ప్రచారం నిర్వహిస్తున్నారు. కళాకారులు ప్రధానంగా రద్దీ ఉండే ఏరియాల్లో ఆటపాటల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

స్పెషల్ సెంటర్లు

- జిల్లాలో 24 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు
- మహిళలకు 10, దివ్యాంగులకు 2, మోడల్ 10, యూత్ పోలింగ్ కేంద్రాలు 2
- వసతులు కల్పిస్తున్న అధికారులు



మానుకోటలో దివ్యాంగుల ప్రత్యేక పోలింగ్ కేంద్రంలో ర్యాంప్‌ల ఏర్పాటు

మహబూబాబాద్: జిల్లాలోని మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో భాగంగా మహిళలు, దివ్యాంగులు, మోడల్, యూత్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా 24 కేంద్రాల ఏర్పాటు చేయగా.. మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు..

డోర్నకల్ నియోజకవర్గంలో చిన్నగూడూరు, దంతాలపల్లి, డోర్నకల్, కురవి, మరిపెడ, నర్సింహులపేట, సీరోలు మండలాల్లో 2,19,264 మంది ఓటర్లు ఉన్నారు. కాగా 256 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే మానుకోట నియోజకవర్గంలో గూడూరు, ఇనుగుర్తి, కేసముద్రం, మానుకోట, నెల్లికుదురు, దంతాలపల్లి మండలంలోని బొడ్లాడ గ్రామం ఉన్నాయి. కాగా 2,53,342 మంది ఓటర్లకు 283 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మానుకోటలో..

మానుకోట నియోజకవర్గంలో 5 మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ ఆశ్రమ హైస్కూల్, ఇనుగుర్తి ఎంపీపీఎస్, కేసముద్రం జెడ్పీహెచ్ఎస్, నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి ఎంపీయూపీఎస్, గూడూరు మండలం చంద్రుగూడెం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ హైస్కూల్‌లో మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని గుమ్ముడూర్ ఎంపీపీఎస్‌లో దివ్యాంగ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో డీఈఓ కార్యాలయం, ఇనుగుర్తి జెడ్పీఎస్ఎస్, కేసముద్రం ఎంపీఎస్, నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల, గూడూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మోడల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు గూడూరు మండలంలోని తేజావత్ రాంసింగ్ తండాలోని ప్రభుత్వ డీఎన్‌టీ ప్రైమరీ స్కూల్‌లో యూత్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

డోర్నకల్ నియోజకవర్గంలో..

డోర్నకల్ నియోజకవర్గంలో 5మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యాంగ కేంద్రం, 5మోడల్ కేంద్రాలు, ఒక యూత్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా మండలాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్వో తెలిపారు.

కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ..

మానుకోట నియోజకవర్గంలో 12 ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేస్తున్నాం. తగిన వసతులు కల్పిస్తున్నాం. ఓటర్లు ఆయా కేంద్రాల్లో వంద శాతం ఓటింగ్‌కు సహకరించాలి. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

-అలివేలు, మానుకోట నియోజకవర్గ ఆర్వో

పెళ్లి వేడుకలో.. క్రికెట్ సందడి

- ఒకవైపు పెళ్లి.. మరోవైపు వరల్డ్‌కప్ క్రికెట్‌ను తిలకించిన బంధుమిత్రులు



క్రికెట్ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న బంధు, మిత్రులు

కేసముద్రం: ఓ పెళ్లి వేడుకల్లో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌పై వరల్డ్‌కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రంవిలేజ్‌కి చెందిన కొప్పుల వరుణ్‌రెడ్డి, ఆశ్రితారెడ్డి వివాహం హరిహరగార్డెన్‌లో జరిగింది. పెళ్లి వేడుకల దృశ్యాలను ప్రసారం చేసేందుకుగాను బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. అయితే ఇండియా–ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ మ్యాచ్ ఉండడంతో ప్రచారం చేశారు. పెళ్లికి వచ్చిన వారు ఇండియా బ్యాటింగ్‌ను తిలకించారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఇరా సింఘాల్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు బాబురాయ సమక్షంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 539 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెండు నియోజకవర్గాల్లో 26మంది బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. డోర్నకల్ నియోజకవర్గ పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మరిపెడలోని సెయింట్ అగస్టీన్ పాఠశాలలో, మానుకోట సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను పంపిణీ సెంటర్ల నుంచి ఈనెల 29వ తేదీన పోలింగ్ అధికారులకు అందిస్తామన్నారు. 30న పోలింగ్ అనంతరం సాయంత్రం ఈవీఎంలు, వీవీప్యాట్‌లను జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సి ఉంటుందన్నారు. సమీక్షలో డోర్నకల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నర్సింహారావు, మానుకోట రిటర్నింగ్ అధికారి అలివేలు తదితరులు ఉన్నారు.

ఉత్తుత్తి జంప్!

- పార్టీ మారుతున్నామని ముందుగా పుకార్లు
- అభ్యర్థులకు తెలిసేలా నాయకుల వ్యవహార శైలి
- బుజ్జగింపులు.. బేరసారాలతో సమాప్తం



సాక్షి, మహబూబాబాద్: జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉండడంతో ద్వితీయశ్రేణి నాయకులకు డిమాండ్ పెరిగింది. దీంతో నాయకులు పార్టీ మారుతున్నట్లు ముందుగా పుకార్లు పుట్టిస్తున్నారు. తర్వాత అనుచరుల ద్వారా అభ్యర్థులకు తెలిసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. విషయం తెలిసిన సదరు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుజ్జగింపులు, బేరసారాలు జరిపి పార్టీలోనే ఉండేలా చూస్తున్నారు. దీంతో స్టోరీకి ఎండ్‌కార్డు పడుతోంది. కాగా ద్వితీయశ్రేణి నాయకుల డబుల్ గేమ్ అర్థంకాక కొందరు.. అర్థం చేసుకున్నా.. దానిని వ్యతిరేకించలేని పరిస్థితి ఉండడంతో అంతా మనస్సులో పెట్టుకొని బతిమిలాడాల్సిన పరిస్థితి అభ్యర్థులకు దాపురించింది.

పుకార్లు షికారు..

చొక్కాలు మార్చినంత ఈజీగా పలువురు నాయకులు పార్టీలు మారుతున్నారని ప్రచారం. మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరు, నెల్లికుదురు మండలాలతో పాటు మహబూబాబాద్ పట్టణం, డోర్నకల్ నియోజకర్గంలోని కురవి, డోర్నకల్ మండలాలకు చెందిన కొందరు నాయకులు పార్టీలు మారుతున్నామని ప్రచారం చేశారు. ఈ విషయం ఆ నోట..ఈ నోట ఇరు పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులకు తెలిసింది. అసలే పోటీ తీవ్రంగా ఉండడంతో ఎవరితో ఎలాంటి నష్టం జరుగుతుందోనని సదరు అభ్యర్థులు తమ అనుచరులు, కుటుంబ సభ్యులను రాయబారానికి పంపించినట్లు తెలిసింది. పార్టీ మారవద్దని హితోపదేశం చేశారు. ఇప్పుడు గుర్తుకు వచ్చానా.. నాకు గుర్తింపులేదని ఒక పార్టీకి చెందిన నాయకుడు అంటే.. కొత్తవారు రావడంతో ఎప్పటి నుంచో పార్టీకోసం పనిచేసిన మమ్ముల్ని పట్టించుకోవడం లేదని మరొక పార్టీకి చెందిన నాయకుడు అలిగినట్లు ప్రచారం. దీంతో వారిని నచ్చజెప్పడం, బుజ్జగించడం, పార్టీ మారవద్దని చెప్పి వెళ్లినట్లు తెలిసింది.

బేరసారాలు..

పార్టీలు మారాలని భావించే నాయకులను బుజ్జగించడంతో పాటు బేరసారాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇలా జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోకవర్గాల్లోని ఓ పార్టీ నాయకుల అసంతృప్తిని మరోపార్టీ అభ్యర్థులు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. వీరిలో అధిక సంఖ్యలో ఓటర్లను ప్రభావితం చేసే వారు ఉండడంతో సదరు పార్టీలకు చెందిన నాయకులు ముందస్తుగా అలర్ట్ అయ్యారనే ప్రచారం. దీంతో ఆయా నాయకులకు తాము సర్దిచెప్పడమే కాకుండా.. రాష్ట్ర పార్టీకి చెందిన నాయకులతో కూడా మాట్లాడించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో అసంతృప్త నాయకులకు అధిక మొత్తంలో డబ్బు, తాయిలాలు కూడా అందినట్లు ప్రచారం. దీంతో ఆయా నాయకులు పార్టీలు మారే ప్రచారం సద్దుమణిగింది.

వేరుకుళ్లు.. రైతులకు శాపం!

- మిరప తోటలకు తీవ్ర నష్టం
- చలికాలంలో పెరుగుతున్న తెగులు తీవ్రత
- జిల్లాలో 90వేల ఎకరాల్లో పంట సాగు
- ఆందోళనలో రైతన్నలు



కుళ్లిన మిరప మొక్క వేర్లు



గొల్లచర్ల సమీపంలో మిరపతోటలో కుళ్లిన మిరప మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

డోర్నకల్: మిరప తోటల్లో మొక్కలకు వేరుకుళ్లు తెగులు సోకి రైతులు పంటలను నష్టపోతున్నారు. భూమిలో మొక్క తల్లివేరుతో పాటు ఇతర వేర్లు కుళ్లిపోయి చనిపోతున్నాయి. ముఖ్యంగా చలికాలం ప్రారంభం కావడంతో తెగులు తీవ్రత పెరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 90వేల ఎకరాల్లో మిరపపంట సాగవుతుండగా చాలా ప్రాంతాల్లో తోటలకు వేరుకుళ్లు సోకింది. కాగా ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని, లక్షల్లో నష్టపోవాల్సి వస్తోందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నీరు పెట్టే సమయంలో..

నీరు పెడుతున్న సమయంలో ఒక మొక్కనుంచి మరో మొక్కకు వేరుకుళ్లు తెగులు సోకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇలా క్రమేపి వందల సంఖ్యలో మిరప మొక్కలు చనిపోతున్నాయని అంటున్నారు. అలాగే మిరప తోటలు సాగు చేస్తున్న భూములలో విరివిగా రసాయన ఎరువులు వాడడంతో సారం తగ్గడం, భూమి లోపలి పంటలకు మేలు చేసే పురుగులు చనిపోవడంతో మిరప తోటలకు వేరుకుళ్లు సోకుతుందని రైతులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

చలికాలంలో వేరుకుళ్లు తెగులు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలి. పంట మార్పిడి పద్ధతి కచ్చితంగా పాటించాలి. సాగు ఆరంభంలోనే జాగ్రత్తలు పాటిస్తూ తోటకు నీరందించే సమయంలో అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

- అనితశ్రీ, ఉద్యానశాఖ అధికారి

తల్లివేరు అభివృద్ధిని అధ్యయనం చేశాం

వేరుకుళ్ల తెగులు ప్రభావం ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. తెగులు సోకిన తోటలను పరిశీలించి సమస్యపై ప్రత్యేక పరిశోధన జరిపాం. తెగులు సోకిన తల్లివేరు పునర్జీవం పోసుకుని మొక్క బతికేలా తమ సంస్థ నుంచి ఫాస్ట్ రూటెక్స్, స్టాఫ్‌విల్ట్, క్యూరియల్ మిశ్రమాన్ని మొక్క మొదటిలో వేసిన తర్వాత పరిశీలించి మంచి ఫలితాలు వచ్చినట్లు గమనించాం. ఈ ప్రాంత రైతులు ఈ పద్ధతి పాటించి ఫలితాలు సాధించారు.

-వెంకటరమణనాయుడు, ఎండీ, వైకే ల్యాబ్, హైదరాబాద్

శ్రీరామాలయంలో అభిషేకాలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాల అనంతరం తులసి మాలలతో శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. ఆదేవిధంగా శ్రీపద్మావతి అమ్మవారు, గోదాదేవి అమ్మవార్లకు అర్చన పూజలు జరిపారు. కార్యక్రమంలో నూతి మధుసూదన్, అనురాధ, వేమిశెట్టి వెంకన్న, విజయలక్ష్మి, గోపాలకృష్ణారావు, పద్మ, లక్ష్మి, లాలిత్య పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

కేసముద్రం: కార్తీకమాసం సందర్భంగా ఆదివారం మండలంలోని బిచ్యానాయక్‌తండా జీపీలోని ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్‌లోని ఉసిరివనంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్ట్, మహబూబాబాద్ ఆధ్వర్యంలో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఈ పూజా కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ హాజరై పూజలు చేశారు.

దోపిడీ పాలకులను ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ

మహబూబాబాద్ అర్బన్: దోపిడీ పాలకవర్గాన్ని ఓడించడానికి తెలంగాణ మేధావులంతా ఒకట్టై గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ చైర్మన్, సామాజికవేత్త, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబం అధికారాన్ని అడ్డం పెట్టుకొని తెలంగాణను చేసిందన్నారు. ప్రజాప్రతినిధులు పేద రైతులు, ప్రభుత్వ భూములను అవినీతి అధికారుల అండదండలతో ధరణి మాటున సొంతం చేసుకున్నారని ఆరోపించారు. వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ ఇతర జిల్లాల్లో విలువైన భూములను లాక్కున్నారు. బొగ్గు గనులు, ఇసుక, గ్రానైట్ క్వారీలను సొంతం చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మూసివేతకు దిగజార్చి పార్టీ నాయకులకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థలను అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదని, నిరుద్యోగులను నిండా ముంచిందన్నారు. సమావేశంలో డాక్టర్ డోలి సత్యనారాయణ, నాయకులు మైస శ్రీనివాసులు, ఆరుద్ర పరమాత్మచారి, ఖాజా పాషా, కృష్ణప్రసాద్, మానుకోట ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా కాలేరు శ్రీనివాస్



మహబూబాబాద్ రూరల్: మానుకోట పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కాలేరు శ్రీనివాస్‌ను మహబూబాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా తెలంగాణ ప్రభుత్వం నియమించింది. సంబంధిత ఉత్తర్వులను ఆయన ఇటీవల అందుకున్నారు. కాగా మూడు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా కాలేరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన ప్రముఖులందరికి కృతజ్ఞతలు తెలిపారు.



జంగ్ తెలంగాణ

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి ఓట్లు అభ్యర్థించారు.



కొబ్బరి బొండా కొట్టు.. ఓటు పట్టు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్ నాయక్ తరఫున ఆయన సతీమణి జమున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ షాపులో కొబ్బరి బొండా కొట్టి హుస్సేన్ నాయక్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. - మహబూబాబాద్ అర్బన్



చిన్నారిని ఆడిస్తూ.. ఓట్లు అడుగుతూ..

బీఆర్‌ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం మొగుళ్లపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగాపూర్‌లో చిన్నారి దేవాన్ష్ గౌడ్‌ను ఎత్తుకుని ఆడిస్తూ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. - మొగుళ్లపల్లి

ఈ ముచ్చటెరికేనా ?

ప్రలోభాలకు గురి చేస్తే కఠిన శిక్ష ..



కాజీపేట: నామినేషన్ల ఉపసంహరణ పర్వం పూర్తయి ప్రచారం ఊపందుకోవడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. మద్యం, డబ్బు పంపిణీతో పాటు కుల రాజకీయాలు చేయడంలో నాయకులు తలమునకలయ్యారు. అయితే దొరికితేనే దొంగ అన్నట్లు ప్రస్తుత పరిస్థితులు మారాయి. అయినా ఎన్నికల కమిషన్ సిబ్బంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిఘా పెంచింది. ఓటర్లను ప్రలోభ పెట్టే పార్టీలకు అడ్డుకట్ట వేయడానికి కఠిన నిర్ణయాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడితే సెక్షన్ 125 ఆర్‌పీ చట్టం 1851, 153ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అలాగే, ఓటు కోసం మద్యం, డబ్బు, ఇతర వస్తువులు ఇచ్చినా తీసుకున్న ఇద్దరు నేరస్తులే. సెక్షన్ 171బీ, 171ఇ, 171 హెచ్‌బీ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది కాలం జైలు శిక్ష విధిస్తారు. కాగా, ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు నిజాయితీ కలిగిన నాయకులనే ఎన్నుకోవాలి. ప్రలోభాలకు గురి చేస్తూ పట్టుబడితే భారీ మూల్యం తప్పదని గుర్తు పెట్టుకోవాలి.

కాజీపేటలో స్వెటర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



స్వెటర్లు వచ్చేశాయ్..

కాజీపేట : శీతాకాలం సీజన్ వచ్చింది. చలి తీవ్రత పెరుగుతోంది. నవంబర్ రెండో వారం నుంచే చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. దీంతో నగరంలో స్వెటర్లు (చలికోట్లు) విక్రయించే దుకాణాలు విరివిగా వెలిశాయి. గరంకోట్లు, చేతులకు గ్లౌజులు, దుప్పట్లు, తల రక్షణకు అవసరమైన దుస్తులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రూ.50 నుంచి రూ.వెయ్యి దాకా ధరల్లో కావాల్సిన దుస్తులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని వరంగల్ ఎంజీఎం సెంటర్, అశోకా జంక్షన్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వినియోగదారులు కొనుగోళ్లు చేస్తున్నారు.

నగదుపై నజర్..

రూ. లక్ష పరిమితి దాటితే లెక్క చెప్పాల్సిందే..

- ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా..!
- బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక దృష్టి



ఖిలా వరంగల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బ్యాంకు ఆన్‌లైన్ లావాదేవీలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. పరిమితి దాటితే లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే పోటాపోటీ ప్రచారాలు మొదలయ్యాయి. దీంతో డబ్బు వరదలా పారుతోంది. మందు, విందుతోపాటు శ్రేణులను స్వయంగా వాహనాల్లో ఎక్కించుకుని ప్రచారానికి తీసుకెళ్లడం, తిరిగి వారిని ఇంటి దగ్గర దింపడం వంటివి కూడా సహజం. సాంకేతిక పరిజ్ఞానం (ఆన్‌లైన్ పేమెంట్) అందుబాటులోకి రానంత వరకు అధికార, ప్రతిపక్షాలు అనే తేడా లేకుండా డబ్బులివ్వడం పైనే ఆధార పడే వారు. దీని వల్ల ప్రత్యర్థి పార్టీలకు విషయం తెలిసి తీవ్ర ఆందోళనకు దిగే వారు. తద్వారా కొన్ని సార్లు గొడవలు కూడా జరిగేవి. ఇప్పుడా అవస్థ లేదు. ఆన్‌లైన్ చెల్లింపులు షురూ చేస్తున్నారు. అయితే ఇక్కడా కొంత పరిమితి వరకే అనుమతి ఉంది. ఫోన్ పే, గూగుల్‌పే, ఇతర చెల్లింపులు మీద రూ. లక్ష దాటితే లెక్క చూపాల్సిందే. అయితే ఇక్కడే నేతలు తెలివి ప్రదర్శిస్తున్నారు. లిమిట్ దాటకుండా ఒకరి నుంచి మరొకరికి పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అధికారులు ఈ మార్పును కూడా గమనించి కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

రూ.లక్ష దాటితే లెక్క..

నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో బ్యాంకు ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా ఉంటుంది. బ్యాంకుల్లో రూ.లక్షలకు మించి డబ్బు జమ, ఉపసంహరణకు సంబంధించిన లావాదేవీలు ఉంటే కారణాలను అంతర్గతంగా తనిఖీ చేస్తారు. కరెంట్ అకౌంట్‌లపై రూ.10 లక్షలకు మించి లావాదేవీలు ఉంటే ఆదాయపు పన్ను శాఖకు నివేదిస్తారు. మరో వైపు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) ఆధ్వర్యంలో ఇప్పటికే అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై నిఘా మొదలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ తరహా లావాదేవీలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రామాణిక విధానం(స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్) రూపొందించారు. దీని ప్రకారం ఈ-కేవైసీ నిబంధనల ప్రకారం డబ్బు జమ, ఉపసంహరణ, డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపుల వంటివన్నీ నిశ్చితంగా గమనిస్తారు. చిన్న మొత్తంలో ఎక్కువ సార్లు జరిగే లావాదేవీలను పరిశీలించేలా వ్యవస్థ అందుబాటులో ఉంది. కొందరు నేతలు ఈవిషయం ముందుగానే గ్రహించి స్థానిక నేతలతో ఒప్పందాలు కుదుర్చుకుని పరిమితి దాటకుండా, ఎవరికీ అనుమానం కలగకుండా లావాదేవీలు కనిచ్చేస్తున్నట్లు తెలుస్తోంది.

జీరో బ్యాలెన్స్ ఖాతాలపై నిఘా

ప్రధానంగా జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను నిశ్చితంగా పరిశీలిస్తున్నట్లు ఎన్నికల అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. ఎన్నికల ముందు వరకు లావాదేవీలు లేకుండా, తర్వాత అనూహ్యంగా పెరిగితే కారణాలు ఆరా తీస్తారు. ఎన్నికల వేళ నగదు లావాదేవీలపై అప్రమత్తంగా వ్యవహరించకుంటే చిక్కులు కొని తెచ్చుకున్నట్లేనని హెచ్చరిస్తున్నారు. అయితే నేతలు మాత్రం ఆన్‌లైన్ చెల్లింపులను తమకు అనుకూలంగా ఎలా మలుచుకోవచ్చొ అనుభవజ్ఞుల ద్వారా ఆరా తీస్తూ చెల్లింపులకు యత్నిస్తున్నట్లు సమాచారం.

లావాదేవీలపై చర్యలు

ఎన్నికల సమయంలో జిల్లాలో ఆన్‌లైన్‌లో జరిగే నగదు లావాదేవీల కట్టడికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. గత శాసన సభ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు రెట్టింపు దాటాయి. చిన్న మొత్తాల సొమ్మును గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ యాప్‌లతో చెల్లిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు సాధారణ లావాదేవీలు జరిగే బ్యాంకు ఖాతాల్లో ఎన్నికల నేపథ్యంలో అనూహ్యంగా నగదు బదిలీలు పెరగడం, పరిమితికి మించి డబ్బు జమ, విత్‌డ్రాలపై నిఘా వేస్తున్నారు. ఇందుకు బ్యాంకులు, పోలీసులు, ఐటీ విభాగం, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

తండ్రి మందలింపు..

- కొడుకు ఆత్మహత్య

హసన్‌పర్తి: ఆన్‌లైన్‌లో పబ్జీ గేమ్ ఆడుతుండగా తండ్రి మందలించాడు. దీంతో కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో జరిగింది. ఈ మేరకు మృతుడి తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెగడపల్లికి చెందిన మామిడపల్లి రాకేష్(18) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడు. అయితే శుక్రవారం గేమ్స్ ఆడుతుండగా తండ్రి గమనించి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన రాకేష్ పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించి కుటుంబీకులు ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ సీఐ అబ్బయ్య తెలిపారు.

ఆటో బోల్తా..పలువురికి గాయాలు

కాటారం: కాటారం మండలం గంగారం ఎక్స్ రోడ్డు సమీపంలో ఆదివారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. మల్హర్ మండలం వల్లెంకుంట నుంచి కాటారం వైపునకు వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వల్లెంకుంటకు చెందిన సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సకినాల లచ్చమ్మ, గడ్డం లక్ష్మి, లావణ్య, నల్గొండ, దుర్గమ్మ, మల్లమ్మ, లచ్చమ్మ, ఎర్రమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఏడుగురు స్వల్ప గాయాలపాలయ్యారు. లచ్చమ్మ, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. స్వల్పగాయాలైన వారు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన వారిని కాటారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాగా, బోల్తాపడిన ఆటోలో ఉన్న ప్రయాణికులు కాటారంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు వస్తూ ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను అడగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ శ్రీలక్ష్మి, ఆంటోని, జైకో

కాజీపేట రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి అన్నారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న మాంట్‌ఫోర్ట్ స్టేట్ మెగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆదివారం రాత్రి ముగిసింది. ఈ కార్యక్రమానికి శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని పాలిశెట్టి మాట్లాడుతూ రెండు రోజులు జరిగిన స్టేట్ స్పోర్ట్స్ మీట్‌లో నాలుగు రాష్ట్రాల నుంచి 15 స్కూళ్లు, సుమారు 2,000 మంది విద్యార్థులు 20 రకాల క్రీడల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ పి.రవికుమార్, కిట్స్ కాలేజ్ ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి, పూణె ప్రావెన్సి రెవరెండ్ బ్రదర్ జైకో గ్రీవెసిస్, బ్రదర్ షాజన్ ఆంటోని, బ్రదర్ విన్సెంట్ రెడ్డి, బ్రదర్ బాల ఇన్న, పీఈటీ పి.విజయ్‌కమార్, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



సంగెం కాల్వలో బోల్తా పడిన ట్రాక్టర్



రంజిత్ మృతదేహం

ఖానాపురం : ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన అశోక్‌నగర్ శివారులో శనివారం రాత్రి జరిగింది. ఎస్సై మాధవ్ కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన చింత రంజిత్ (26) గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను తీసుకుని శనివారం రాత్రి పాకాల శివారులో మట్టి కోసం వెళ్లాడు. సంగెం కాల్వ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి జేసీబీతో మట్టిని ట్రాక్టర్‌లో పోయించుకుని గ్రామానికి తీసుకొస్తున్నాడు. పగిడిద్దుల బుర్ర సమీపంలో గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న సంగెం కాల్వలో పడిపోయింది. ప్రమాదంలో రంజిత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పంచనామా చేశారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

అటవీ ప్రాంతం నుంచి అనుమతి లేకుండా మట్టి రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జేసీబీ యజమాని ప్రశాంత్, డ్రైవర్ వినోద్, జేసీబీని లీజుకు తీసుకున్న మరొకరిపై కేసు నమోదు చేసినట్లు డీఆర్వో మోహన్ పేర్కొన్నారు.

న్యాయ వ్యవస్థపై పెరుగుతున్న నమ్మకం





జిల్లా కోర్టు హాల్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్

- సత్వర న్యాయం అందించేందుకు కృషి
- హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ ఎన్.రాజేశ్వర్ రావు
- మహబూబాబాద్ జిల్లా కోర్టులో ఆధునికీకరణ పనుల ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరుగుతోందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ ఎన్.రాజేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఆధునీకరించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు హాల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవనం, ప్రజలకు అందించే నీటి శుద్ధి యంత్రాన్ని ఆదివారం ప్రారంభించారు. మొదట హైకోర్టు జడ్జిలకు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్, కలెక్టర్ శశాంక , ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కోర్టు ఆవరణలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయ వ్యవస్థ కృషి చేస్తుందన్నారు. కోర్టులను తల్లిగా భావించాలన్నారు. ప్రజలకు కోర్టులపై ఉన్న విశ్వాసాన్ని వమ్ము చేయొద్దన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరిస్తే మళ్లీ కొత్త కేసులు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి సరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశబోయిన వెంకటస్వామి, కార్యదర్శి జ్యోతిబాబు, ఆర్డీఓ అలివేలు, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, జిల్లా కోర్టు పీపీ వెంకటేశ్వర్లు, పోక్సో కోర్టు పీపీ పద్మాకర్ రెడ్డి, ఏజీపీ భువనగిరి ఆనంద్ గుప్తా పాల్గొన్నారు.

రైల్వే టికెట్ చెకింగ్ బేస్ నిర్వీర్యం

- వరంగల్ నుంచి విజయవాడ తరలింపునకు కుట్ర
- ఆందోళనలో చెకింగ్ సిబ్బంది

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలో గల వరంగల్ రైల్వే స్టేషన్ టికెట్ చెకింగ్ బేస్ నిర్వీర్యానికి కుట్ర జరుగుతోంది. విషయం తెలిసిన టికెట్ చెకింగ్ స్టాఫ్ ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. వరంగల్ డిపో కేంద్రంగా 136 మంది టికెట్ చెకింగ్ స్టాఫ్ విజయవాడ-బల్లార్షా సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 35 మంది స్టాఫ్‌ను విజయవాడలో బేస్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి పని చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే అధికారులు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి 35 మంది టికెట్ చెకింగ్ స్టాఫ్ పోస్టులను విజయవాడకు తరలించేందుకు శ్రీకారం చుట్టారని సిబ్బంది తెలిపారు. వరంగల్ నుంచి విజయవాడకు తరలించి 35 పోస్టులలో ఖమ్మం, విజయవాడ సిబ్బందిని భర్తీ చేసి విజయవాడ నుంచి బల్లార్షా వరకు అప్ అండ్ డౌన్ విధులు నిర్వహించేలా చార్ట్‌ను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల ప్రధాన రైళ్లు విజయవాడ అకౌంట్ లోపడే అవకాశం ఉందని, వరంగల్ నుంచి 35 పోస్టులను విజయవాడకు తరలించడం వల్ల వరంగల్, కాజీపేట ప్రాధాన్యత తగ్గుతుందని భవిష్యత్‌లో వరంగల్, కాజీపేట కమర్షియల్ డిపోలకు దెబ్బపడే అవకాశం ఉందని అంటున్నారు. కాజీపేట రైల్వే డివిజన్ కేంద్రం కావాలని పోరాటాలు జరుగుతుంటే మరోవైపు చాపకింద నీరులా కాజీపేట, వరంగల్ నుంచి రైల్వే యూనిట్లు తరలింపుకు బాటలు పడుతున్నాయి. గతంలో కూడా కాజీపేట రైల్వే డ్రైవర్ల కార్యాలయం నుంచి విజయవాడకు క్రూ లింక్‌లు తరలిపోయాయి. దీంతో డ్రైవర్లు, గార్డుల ప్రాధాన్యత తగ్గింది. క్రూ లింక్‌ల బాటలో చెకింగ్ స్టాఫ్ పోస్టులను విజయవాడకు తరలించనున్నారని, రేపో మాపో అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే ట్రేడ్ యూనియన్ల నాయకులు, ఎంపీలు పట్టించుకొని వరంగల్ నుంచి టికెట్ చెకింగ్ స్టాఫ్ పోస్టులను విజయవాడకు తరలించకుండా రైల్వే జీఎం, డీఆర్‌ఎంపై ఒత్తిడి తీసుకరావాలని కమర్షియల్ సిబ్బంది కోరుతున్నారు.


ఆరు ప్యాసింజర్ రైళ్ల రద్దు



కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధి వివిధ రూట్లలో ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఆదివారం రాత్రి కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. పలు మార్గాల్లో రైల్వే అభివృద్ధి పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకునట్లు పేర్కొన్నారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్-వరంగల్ (07462) పుష్‌పుల్. వరంగల్-సికింద్రాబాద్(07463) పుష్‌పుల్, కాజీపేట-బల్లార్షా(17035) రామగిరి ప్యాసింజర్, కాజీపేట-డోర్నకల్(07753) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట(07754) ప్యాసింజర్ ఈనెల 26 వరకు, బల్లార్షా-కాజీపేట(17036) రామగిరి ప్యాసింజర్ ఈనెల 27 వరకు రద్దు చేసినట్లు వివరించారు.

మావోయిస్టు వాల్ పోస్టర్ల కలకలం

కొత్తగూడ : ఇటీవల కరపత్రాలతో తమ ఉనికిని చాటుకున్న మావోయిస్టులు మళ్లీ మండల కేంద్రంలోని ఓ వ్యాపారి ఇంటి గోడకు శనివారం రాత్రి పోస్టర్లు అంటించి సంచలనం సృష్టించారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి నిర్వహించే పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలని పోస్టర్లలో పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా గెరిల్లా పోరాటం, వర్గ పోరాటాలను ఉధృతం చేద్దాం.. సూరజ్‌కుండ్ దాడులను ఓడిద్దాం.. విప్లవాన్ని విస్తరించి, పురోగమిద్దాం.. అంటూ ఇల్లందు-నర్సంపేట ఏరియా మావోయిస్టు కమిటీ పేరుతో ఒకే చోట 10 పోస్టర్లను అంటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వాటిని తొలగించారు.



మండలకేంద్రంలో వెలసిన వాల్ పోస్టర్లు